క్లుప్తంగా

చురుగ్గా ఫుట్‌పాత్ పనులు



సీతంపేటలో ఫుట్‌పాత్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులోని దుర్గాగణపతి ఆలయం వద్ద మెయిన్ రోడ్‌కు ఆనుకుని ఇటీవల సీసీ కాలువలు నిర్మించారు. వీటిపై వేసిన సిమెంట్ పలకలపై టైల్స్ వేసి ఫుట్‌పాత్ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఈ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ పూర్ణచంద్రరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



సాయిరాం నగర్‌లో పర్యటిస్తున్న 50వ వార్డు కార్పొరేటర్ ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సాయిరాం నగర్ కాలనీలో సకల సదుపాయాలు కల్పిస్తున్నామని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన వార్డులో మంగళవారం పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల అవసరాల కోసం పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పనులు వేగవంతం చేయాలని జోన్-5 అధికారులను ఆయన కోరారు. కాలనీ పెద్దలు రామారావు, లోవరాజు, నాయుడు, దేవుడుబాబు, దాలినాయుడు, రాంబాబు, సీతారామ్, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల కవచధారి యోగ సిద్ధాంజనేయుడు



మురళీనగర్: సూర్యానగర్-2 జాతీయ రహదారిని ఆనుకుని కొలువుదీరిన యోగసిద్ధాంజనేయుడికి మంగళవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం యోగసిద్ధాంజనేయుడిని ముత్యాల కవచధారిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణం చేశారు. ఈ కార్యక్రమమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు దంపతులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



రైల్వేస్టేషన్‌లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జీఆర్పీ ఉన్నతాధికారులు, విశాఖపట్నం ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు తనిఖీలు నిర్వహిస్తూ, ప్రయాణికులు, యజమానుల్లో అవగాహన కల్పించనున్నారు.

జిమ్‌దాబాద్

ఒకప్పుడు చెత్తా చెదారం.. శిథిలమైన ఫెన్సింగ్, ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా ఉండే గ్రీన్ బెల్ట్‌ల రూపురేఖలు ప్రస్తుత ప్రభుత్వం చొరవతో మారిపోయాయి. ఆరోగ్యం, ఆహ్లాదం రెండూ ఒకే చోట దొరికేలా తీర్చిదిద్దారు. నగరంలో జాతీయ రహదారికి ఆనుకుని మణిహారంగా ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాలను హెల్తీ పార్కులుగా ఆధునికీకరించారు. కాసేపు సేద తీరడానికి అనువుగా బెంచీలు, శారీరం వ్యాయామం కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుతో గ్రీన్ బెల్ట్‌లు విశేష ఆదరణకు నోచుకున్నాయి.

– సీతంపేట



నాడు
సత్యం సెంటర్ వద్ద కళావిహీనంగా, రక్షణ లేని గ్రీన్ బెల్ట్ ప్రాంతం



నేడు
సత్యం సెంటర్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో నిర్మించిన వాకింగ్ ట్రాక్

ఆహ్లాదకరంగా గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధి

వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో విశేష ఆదరణ

25వ వార్డులో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి చేసిన ఖర్చు	44వ వార్డులో గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి చేసిన ఖర్చు	44వ వార్డులో గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి అదనంగా మంజూరైన నిధులు
రూ.30 లక్షలు	రూ.30 లక్షలు	రూ.30 లక్షలు



ఇది కదా అభివృద్ధి

విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో సత్యం సెంటర్ నుంచి ఆర్అండ్‌బీ కూడలి వరకు విస్తరించినున్న గ్రీన్ బెల్ట్‌ని చూడముచ్చటగా అభివృద్ధి చేశారు. 25వ వార్డు పరిధిలో సత్యం కూడలి వద్ద, 44వ వార్డు అబిద్‌నగర్ వద్ద అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ పక్కన గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య ఒకవైపు వాకింగ్ ట్రాక్, మరో వైపు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. 25వ వార్డులో 509 మీటర్లు పొడవు, 44వ వార్డులో 380 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. సాయంత్రం వేళ సేదతీరేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. చెట్లకు రంగులు వేసి మువ్వన్నెల జెండాలను తలపించేలా పెయింటింగ్ ఆకట్టుకుంటోంది. గ్రీన్ బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్ పునరుద్ధరించి పెయింటింగ్ వేశారు. పార్కులోకి వెళ్లేందుకు గేటు ఏర్పాటు చేశారు.



సత్యం సెంటర్ వద్ద ఓపెన్ జిమ్‌లో సందడి

ఓపెన్ జిమ్‌లో ఏమున్నాయంటే..

గ్రీన్ బెల్ట్‌లో ఓపెన్ జిమ్‌లో ఆత్యాధునిక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. భుజాలు, చేతులు, నడుము, పొట్ట భాగాలు తగ్గేందుకు రోవర్, సోల్డర్ బిల్డర్, ట్రిపుల్ స్టాండింగ్ ట్విస్టర్, హార్స్ రైడర్, స్కైవాకర్, క్రాస్ ట్రైనర్ వంటి పరికరాలు ఓపెన్‌జిమ్‌లో అందుబాటులో ఉన్నాయి.



అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ వద్ద నిర్మించిన వాకింగ్ ట్రాక్



గ్రీన్‌బెల్ట్‌కు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన గేటు



ఖర్చు లేకుండా ఆరోగ్యం...

డబ్బులు చెల్లించి జిమ్‌లకు ప్రత్యేకంగా వెళ్లడానికి సమయం కుదరని తమలాంటి వారికి ఇంటి సమీపంలో ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. ఖర్చు లేకుండా ఇంటి దగ్గరలోనే ఆరోగ్యం, ఆహ్లాదం దొరుకుతోంది. కొంత మంది మహిళలు పిల్లలను ఆట విడుపుగా తీసుకుని వచ్చి ఓపెన్ జిమ్‌లను వినియోగిస్తున్నారు.

– ఎస్.విజయ్‌కుమార్, సీతంపేట



ప్రభుత్వ ఆలోచన బాగుంది

గతంలో వాకింగ్ చేయాలంటే ఏయూ గ్రౌండ్‌కు వెళ్లాల్సి వచ్చేది, ఇప్పుడు ఇంటికి దగ్గరలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ అందుబాటులోకి వచ్చాయి. రోజూ ఉదయం సాయంత్రం అర గంట వాకింగ్, మరో అర గంట ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్నాను. ప్రభుత్వం ఆలోచన చాలా బాగుంది. నాలాంటి వారికి ఎందరికో ఉపయోగకరంగా ఉన్నాయి.

– ఉప్పాడ కుమారి, గణేష్‌నగర్



ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది

కరోనా తర్వాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. వాకింగ్‌కు వెళ్లాలన్నా, ఎక్సర్‌సైజుల కోసం జిమ్‌కు వెళ్లాలన్నా దూరాభారం, ఖర్చుతో కూడుకున్న పని. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధిలో భాగంగా ఇంటికి సమీపంలో వాకింగ్ ట్రాక్, జిమ్ వంటి వసతులు సమకూర్చారు. చాలా మంది మహిళలు, పిల్లలు వాకింగ్ చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల కుస్తీ కూడా పడుతున్నారు.

– బి.గౌరి, ఎంటీసీ పాలెం, అక్కయ్యపాలెం

వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు చక్రాల వాహనాలను వేలం వేయనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) గోపాలపట్నం సర్కిల్-4 సీఐ సీహెచ్.వి.ఎస్.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాలు పక్కన ఉన్న గోపాలపట్నం సర్కిల్-4 కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. సెబ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, డీఎస్ఈవో బి.శ్రీనివాసరావు సమక్షంలో జరిగే ఈ వేలం వివరాల కోసం 9440902382 నంబర్‌కు ఫోన్ సంప్రదించాలని ఆయన కోరారు.

గౌరీపరమేశ్వరులకు పూజలు



గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

మద్రిపాలెం: స్థానిక మద్రిపాలెంలోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో చిరంజీవి, సదరం జ్ఞానేష్, జ్యోస్న, ప్రసాద్, అలజంగి కృష్ణ, అచ్యుతరావు, నూకరాజు, నాగరాజు, పారన్న పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కంచరపాలెం ఇందిరానగర్-5లో పి.సత్యనారాయణ(20) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. తండ్రితో కలిసి మేస్త్రీ పనులకు వెళ్తుంటాడు. ఈయనకు సోదరుడు, సోదరి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం తండ్రి పనికి వెళ్లిపోగా.. తల్లి టైలరింగ్ పనుల నిమిత్తం వెళ్లిపోయారు. మధ్యాహ్నం రెండో కుమారుడు తల్లి వద్దకు వెళ్లిపోయాడు. తిరిగి తల్లి, చిన కుమారుడు ఇంటికి వచ్చే చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఫ్యాన్ హుక్‌కి సత్యనారాయణ వేళాడుతూ కనిపించాడు. ఈ మేరకు తల్లి వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్ : మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎస్ఎస్ - 288 మీదుగా ఎల్‌టీ కండక్టర్ మార్పిడి పనులు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ - 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శివనగర్, ఎఫ్‌సీఐ రోడ్డు, ఆంధ్రకేశరి నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

బోధ వ్యాధి గుర్తింపునకు రక్తపూతల సేకరణ



అక్కయ్యపాలెంలో రక్తపూతలు సేకరిస్తున్న సిబ్బంది

సీతంపేట : బోధ వ్యాధిని గుర్తించేందుకు జిల్లా మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రక్తపూతలు సేకరించారు. జిల్లా మలేరియా నివారణ విభాగం అధికారి ఎం.తులసి ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయిక్, శేషుబాబు, సిబ్బంది అక్కయ్యపాలెం, చిన్నూరు, నర్సింహనగర్, తాటిచెట్లపాలెంలో రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి నగేష్ మాట్లాడుతూ బోధ వ్యాధి కారక క్రిమిని గుర్తించాలంటే రాత్రి వేళల్లో రక్త పూతలు సేకరించి, పరీక్షించాలన్నారు. ఈ ప్రక్రియ ద్వారా గుర్తించిన రోగులకు ఉచితంగా మందులు అందించి చికిత్స చేయనున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.వై.ఎస్.రత్నం, బర్రే కుమార్, సత్యానంద్, రామినాయుడు, సతీష్, కుమార్, మహస్‌దాదా, రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



46వ వార్డులో పార్టీ జెండా ఎగురవేస్తున్న కేకే రాజు



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

కంచరపాలెం: నాలుగేళ్ల పరిపాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 46వ వార్డు మధుసూధన్‌నగర్, 55వ వార్డు రవీంద్రనగర్‌లో డిప్యూటీ మేయర్, మండల ఇన్‌చార్జి కటుమూరి సతీష్, కార్పొరేటర్ శశికళ నేతృత్వంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే రాజు సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత జగనన్న సుపరిపాలనకు మధ్య వ్యత్యాసం చూసుకోవాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు అప్పారావు, కె.చిన్న, క్రిష్ణ, రామారావు, బాల లావణ్య, శివప్రసాద్, శ్రీను, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం బాపూజీనగర్ సచివాలయ పరిధిలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించి, పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో శంకర్, గోపి, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది



జ్యోతీరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేకే రాజు, నాయకులు

సీతమ్మధార : మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సమాన హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. మహిళలను విద్యావంతులను చేసేందుకు చేసిన కృషి ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. పూలే స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కేవీఎన్ శశికళ, వార్డు అధ్యక్షులు, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో మహాత్మ జ్యోతీరావు పూలే విగ్రహానికి అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్లు అచ్చి రవికుమార్, ఓ.సింహాద్రి, బి.రామచంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, దిడ్డి రమేష్, పొన్నాడ అప్పారావు, తిరుమలరావు, మెట్ట దమయంతి పాల్గొన్నారు.

23 ఆటోలపై కేసుల నమోదు



స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి

గోపాలపట్నం: స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కొమ్మాది, ఎండాడ, ఉప్పాడ ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 23 ఆటోలు, ఓ స్కూల్ బస్సుపై కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో 130 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్కూల్ ఆటోల్లో అధిక శాతం మంది పిల్లలు ఉంటున్నారని, ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, రాజారావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆటోల్లో సౌండ్ బాక్స్‌ల తొలగింపు



ఆటోలోని సౌండ్ సిస్టమ్ తొలగిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురుద్వార్, ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ ఆధ్వర్యంలో పలు ఆటోలు తనిఖీ చేశారు. సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి, పెద్ద సౌండ్ పెడుతున్న ఆటోల డ్రైవర్లకు జరిమానా విధించి, ఆ బాక్స్‌లు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలో పెద్దగా సౌండ్ పెట్టి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో నడిపేటప్పుడు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని, డ్రైవర్లు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు.

మధురం.. కర్ణాటక వాయిద్య కచేరీ



కచేరీ చేస్తున్న వాయిద్య కళాకారులు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 54వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం చెన్నైకి చెందిన కర్ణాటక వాయిద్య కచేరీ సుమధురంగా సాగింది. ఈ కచేరీలో మాండోలిన్‌పై రాజేష్, వయోలిన్‌పై వి.వి.శ్రీనివాసరావు, మృదంగంపై డాక్టర్ సతీష్‌కుమార్, ఘటంపై ఎస్.కార్తీక్ సహకారం అందించి సంగీత ప్రియులను ఓలలాడించారు.